ప్రజాశక్తి
శనివారం 4 నవంబర్ 2023
5
పార్వతీపురం మన్యం

## 9న జాబ్ మేళా

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక వైటిసిలో ఈనెల 9న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు శ్రీసిటీలో క్యాడ్ బర్రీ చాక్లెట్ తయారు చేసే ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీ అయిన మొండేలేజ్ ఇండియా లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటర్, డిగ్రీ డ్రాపౌట్,18 నుండి 20 ఏళ్లలోపు స్త్రీలు, పురుషులు అర్హులన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారు నెల్లూరు శ్రీసిటీలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. వీరికి నెలకు రూ.17,500 వేతనం ఇవ్వబడుతుందని, ఆసక్తి గలవారు తమ పూర్తి ధ్రువపత్రాలతో ఈనెల 9న ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు 9150015264 నంబరుకు సంప్రదించాలన్నారు.

బహిరంగ సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

ఎన్నో సహజ వనరులు, సారవంతమైన భూములు ఉన్నా పాలకులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించడం వల్ల జిల్లా అత్యంత వెనుకబడిపోయిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, వై.వెంకటేశ్వరరావు అన్నారు. మరోవైపు రాష్ట్రానికి మోసం చేసిన బిజెపికి వైసిపి, టిడిపి ఊడిగం చేస్తున్నాయని విమర్శించారు. ప్రశ్నిస్తానంటున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా బిజెపి వద్ద నోరు మెదపడం లేదన్నారు. ఈనేపథ్యంలో జనసేన కార్యకర్తలు లోతుగా ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజారక్షణ భేరి ముగింపు సందర్భంగా ఈనెల 15న విజయవాడలో జరగబోయే బహిరంగ సభకు ప్రజలంతా తరలిరావాలని పిలుపునిచ్చారు.

# పాలకుల నిర్లక్ష్యం వల్లే జిల్లా వెనుకబాటు

- బిజెపికి వైసిపి, టిడిపి ఊడిగం
- జనసేన కార్యకర్తలు ఆలోచించాలి
- 15న విజయవాడ సభకు తరలిరావాలి
- ప్రజారక్షణ భేరిలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - విజయనగరంటౌన్, జామి, శృంగవరపుకోట, కొత్తవలస

మందసలో ఈనెల 2న ప్రారంభమైన ప్రజారక్షణ భేరి బస్సుయాత్ర శుక్రవారం విజయనగరం జిల్లాలో సాగింది. పూసపాటిరేగ, విజయనగరం, జామి, కొత్తవలస, ఎస్.కోట మీదుగా విశాఖ జిల్లాలో ప్రవేశించింది. విజయనగరంలో కోట వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో లోకనాథం, వెంకటేశ్వరరావు మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వచ్చాక సాగునీటి రంగాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. దీంతో, జిల్లాలోని తోటపల్లి లక్ష్యానికి అనుగుణంగా సాగునీరు అందించలేక పోతోందన్నారు. తారకరామతీర్థసాగర్ అసంపూర్తిగా ఉండడం వల్ల నెల్లిమర్ల నియోజకవర్గవాసులు 18ఏళ్లగా ఎదురు చూస్తున్నా సాగునీరు అందలేదని, విజయనగరం పట్టణానికి తాగునీరు కూడా వచ్చే పరిస్థితి లేదని వివరించారు. సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్మించి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని చెప్పిన మాటలు నీటిమూటలుగానే మిగిలాయన్నారు. భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని సహకార రంగంలోకి తీసుకొస్తామని పాదయాత్రలో ఇచ్చిన హామీ నెరవేరలేదు సరికదా ఆధునీకరణ పేరుతో ఫ్యాక్టరీని మూసేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బొబ్బిలిలోని ఎన్‌సిఎస్ సుగర్స్ యాజమాన్యం నుంచి బకాయిలు ఇప్పించాలని రైతులు ఆందోళన చేస్తే, ఆ పేరుతో ఫ్యాక్టరీ భూములను విక్రయించి, అసలుకే ఎసరు పెట్టారన్నారు. దీంతో, వందల కిలోమీటర్ల దూరంలోవున్న సంకిలి తీసుకెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యుత్ సంస్కరణవల్ల విద్యుత్ భారాల మోయలేని ఫెర్రో ఎల్లాయీస్ పరిశ్రమలు ఆర్థికంగా కుదేలై చాలా వరకు మూత పడ్డాయని, మరికొన్ని ఆ దిశగానే ఉన్నాయని అన్నారు. ఫలితంగా వందలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

వై.వెంకటేశ్వరరావు


ప్రభావతి


ఎవి నాగేశ్వరరావు

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా, వైద్య రంగాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. జాతీయ విద్యా విధానం పేరుతో విద్యా రంగంలో స్కూళ్లను మెర్జిచేసి, ఉపాధ్యాయ పోస్టులను కుదిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 40 ఏళ్ల నుంచి కార్మికుల నిజ వేతనాలు పడి పోయాయన్నారు. 13ఏళ్లుగా కనీస వేతనాలలో సవరణ లేదన్నారు. బానిసలుగా పని చేయించుకొని చాలీచాలని వేతనాలతో బతకాల్సి వస్తుందన్నారు. అన్ని రంగాల్లో పని చేస్తున్న వారికి, స్కీమ్ వర్కర్లకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రభావతి మాట్లాడుతూ కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో జగన్ జోడీలు ప్రజలను మోసం చేస్తూ పబ్బం గడుపుకుంటున్నాయని విమర్శించారు. మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ అడిగింది తొలుత కమ్యూనిస్టులేని, ఇటీవల పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టిన బిజెపి 2024 ఎన్నికల్లో అమలు చేసేందుకు మీనమేషాలు లెక్కిస్తోందన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలు మూతపడిన, ప్రభుత్వ పరిశ్రమలు అమ్మేస్తున్నా మంత్రి బొత్సకు పట్టడం లేదన్నారు. మన సమస్యల పరిష్కారం కోసం మనమే పోరాడాలని, ఇటువంటి పోరాటాలు నిర్వహించే సిపిఎం అండగా ప్రజలు నిలబడాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు బస్సు యాత్ర తో వచ్చిన ప్రజా నాట్యమండలి కళారూపాలు, విప్లవ గేయాలు, ప్రభుత్వ తీరును ఎండగడుతూ నిర్వహించిన నాటికలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎవి నాగేశ్వరరావు, బి.ప్రభావతి, కె.ధనలక్ష్మి, హరిబాబు, జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టివి రమణ, వి.లక్ష్మి జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా రక్షణ భేరికి ఘన స్వాగతం

జిల్లాలో ప్రవేశించిన ప్రజా రక్షణ భేరి బస్సుయాత్ర నాయకులకు పూసపాటిరేగలో సిపిఎం అభిమానులు, కార్యకర్తలు, స్కీమ్‌వర్కర్లు, విద్యార్థులు, రైతులు, పైడిభీమవరం ప్రాంతానికి చెందిన కార్మికులు ఘన స్వాగతం పలికారు. మహిళలు నాయకులకు నుదుటన తిలకం దిద్ది హారతిపట్టారు. అనంతరం నగరానికి చేరుకున్న బృందానికి గుమ్చీ సెంటర్‌లో సిపిఎం కార్యకర్తలు, అభిమానులు, విద్యార్థులు కోలాటంతో స్వాతం పలికారు. అక్కడి నుంచి కోట వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. యువతీ, యువకులు కోలాటంతో అలరించారు. సభ అనంతరం పాత ఎయు క్యాంపస్ భవనంలో నిర్వహిస్తున్న గిరిజన వర్సిటీని నాయకులు సందర్శించారు. తరువాత భీమసింగి, జామి మీదుగా ఎస్‌కోట, అక్కడి నుంచి కొత్తవలస వరకు ప్రజారక్షణభేరి యాత్ర సాగింది. ఈ సందర్భంగా అన్నిచోట్లా వివిధ తరగతులకు చెందిన ప్రజానీకం నాయకులకు వినతిపత్రాలు అందజేశారు.

### సిపిఎం బృందానికి వినతులు

సిపిఎం బృందానికి సమస్యల పరిష్కారం కోసం పలువురు వినతులు ఇచ్చారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు, విఆర్‌ఎలు, డివైఎఫ్ ఐ, ఎస్‌ఎఫ్ ఐ, ఎపి బేవరేజెస్ సంఘం నాయకులు, ఆర్‌టిసి అద్దె బస్సు డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు, భవన నిర్మాణ కార్మికులు తమ సమస్యలపై వినతులు అందజేశారు. ఎల్‌బిజి నగర్, గురజాడ నగర్, రామకష్ణ నగర్, బాబామెట్ట, సుందరయ్య కాలనీ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు.

నాయకులకు వినతి అందిస్తున్న ఆశావర్కర్లు

### ఎర్రజెండా బలపడటంతోనే ప్రజలకు మేలు

సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రకు కొత్తవలస మండల కేంద్రంలో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా జరిగిన సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి 9 ఏళ్లలో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. రాష్ట్ర విభజన చట్టంలోని ఏ ఒక్క అంశాన్ని అమలు చేయని బిజెపికి వ్యతిరేకంగా వైసిపి, టిడిపిలు నిలబడాలని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేసి, కార్మిక హక్కులను కాలరాసి, కుల,మత విద్వేషాలను రెచ్చగొట్టే బిజెపికి వ్యతిరేకంగా, రాష్ట్రంలో అసమానతలు లేని అభివృద్ధి కోసం పోరాడుతున్న సిపిఎం వెంట ప్రజలు నడవాలని పిలుపు నిచ్చారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రభావతి మాట్లాడుతూ మహిళల కు సమన హక్కుల కోసం, అసమానతలు రూపు మాపేందుకు సిపిఎం చేసే పోరాటంలో మహిళలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ సిపిఎంగా స్థానిక సమస్యలపైన, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోసం నిరంతరం పోరాడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గాడి అప్పారావు పాల్గొన్నారు.

### 'భీమసింగి' మూతతో చెరకు రైతులకు అన్యాయం

జామి మండల కేంద్రానికి చేరుకున్న ప్రజారక్షణ భేరికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ ఆధ్వర్యంలో అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు, చెరకు రైతులు స్వాగతం పలికారు. భీమసింగి సహకార చక్కెర కర్మాగారం మూసివేతతో ఈ ప్రాంత చెరకు రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని, తక్షణమే ఫ్యాక్టరీ తెరిపించే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరుతూ నాయకులకు రైతులు వినతులు అందజేశారు. అంగన్ వాడీ, ఆశా కార్యకర్తలు, పారిశుధ్య కార్మికులు సైతం తమ సమస్యలపై వినతులు అందజేశారు.

అనంతరం సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ, నిత్యావసర ధరలు తగ్గించి ప్రజానీకాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గ్యాస్ రూ.400, పెట్రోల్, డీజిల్ లీటరు రూ.60కే అందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కోసం తప్ప పేదల కోసం పని చేయడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బుద్ధరాజు రాంబాబు మాట్లాడుతూ, జామి లో అగ్రహారం భూ సమస్యను పరిష్కరించి, సాగులో ఉన్న రైతులకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు.

### ప్రజల ఆస్తులను కార్పొరేట్లకు దోచిపెడుతున్నారు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ఆస్తులను కార్పొరేట్లకు దోచి పెడుతున్నాయని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.హరిబాబు అన్నారు. ఎస్.కోట చేరుకున్న బస్సుయాత్ర బృందానికి విద్యార్థులు, కార్మికులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎం హరిబాబు మాట్లాడుతూ. కేంద్రంలో మోడీ ప్రజల ఆస్తులైన ప్రభుత్వ సంస్థలను అమ్మేస్తుంటే రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గాని, చంద్రబాబు నాయుడు గాని, పవన్ కళ్యాణ్ గాని నోరు మెదపటం లేదని అన్నారు. సిపిఎం నాయకులకు పోలవరం కాలువలో భూమిపోయిన రైతులు, బైపాస్ రోడ్డులో భూములు కోల్పోయిన రైతులు, ఏళ్ల తరబడి దేవాదాయ భూములను సాగు చేస్తున్న రైతులు గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ అంబాసిడర్లు తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా చూడాలని వినతులను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులతో పాటు బుద్ధరాజు రాంబాబు, చల్ల జగన్, మద్దిల రమణ తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోటలో వినతులు స్వీకరిస్తున్న నాయకులు

కూర్మరాజుపేటలో నీరులేక ఎండిపోతున్న వరిపంట

## కరువు తరుముకొస్తున్నా కనికరం లేదా?

- చేతికొచ్చిన పంట నాశనం
- చోద్యం చూస్తున్న జిల్లా యంత్రాంగం
- ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకుండా తాత్సారం

ప్రజాశక్తి - సాలూరు

కరువు తరుముకొస్తున్నా జిల్లా వ్యవసాయ, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు చోద్యం చూస్తున్నారు. చేతికి అంది వచ్చే సమయంలో పంట బుగ్గిపాలవ్వడానికి సిద్ధమవుతున్న పరిస్థితి చూసి అన్నదాతల గుండె చెరువు అవుతోంది. ఖరీఫ్ సీజన్లో వరిసాగుకు ఎకరాకు రూ.20వేలు చొప్పున పెట్టుబడి పెట్టిన రైతులు ఆందోళనలో వున్నారు. అక్టోబరు నెలలో పడాల్సిన సాధారణ వర్షపాతం కూడా నమోదు కాకపోవడంతో మండలం లోని 6వేల ఎకరాల భూములు బీడుగా మారుతోంది. ఇప్పటికే మండలంలో తాజా పరిస్థితులపై వ్యవసాయ శాఖ అధికారులు జిల్లా అధికారులకు నివేదించారు. వారం రోజుల్లో ఆఖరి తడి అందకపోతే వరి పొలాలు పూర్తిగా దెబ్బతినే అవకాశం వుందని నివేదించారు. పాచిపెంట మండలంలోని కర్రివలస ఆనకట్ట ఎడమ కాలువ ద్వారా నీరు కోస్టువలస వరకు వస్తోంది. ఈ నీటిని సాలూరు మండలం కొత్తవలస పాండీ చెరువుకు చేరేలా కాలువ పూడికతీత పనులు చేయిస్తే కరువు నివారణ చేయొచ్చునని రైతులు వ్యవసాయ అధికారులకు సూచించారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ, పెద్దగెడ్డ ఇరిగేషన్ అధికారులు పంట భూములు, ఇరిగేషన్ కాలువ పరిస్థితిని పరిశీలిం చారు. కానీ ఇంతవరకు ఏ విధమైన ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్న దాఖలాల్లేవు. ప్రత్యామ్నాయ చర్యలపై అన్నదాతల ఆశలు అడుగంటి పోతున్నాయి. యుద్ధప్రాతిపదికన కాలువ పూడికతీత పనులు చేయిస్తే గాని ఎండిపోయిన వరి పొలాలకు నీటితడి అందే అవకాశం లేదు. ఫలితంగా కూర్మ రాజుపేట, చంద్రప్పవలస, దేవుబుచ్చింపేట, పిఎన్ బొడ్డవలస, బంగారమ్మపేట, కొత్తవలస గ్రామాల్లో పొలాలు పూర్తిగా ఎండి పోయే దశకు చేరుకున్నాయి.

**కలెక్టర్ రూ.10 లక్షలిస్తే పూడిక తీత పనులు**

మండలంలో కరువు కోరల్లో చిక్కుకున్న వరి పొలాలకు నీటితడి అందే అవకాశం పరిశీలించిన ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారులు ఇంతవరకు ఏ విధమైన చర్యలు తీసుకోలేదని తెలుస్తోంది. జిల్లా కలెక్టర్‌కు తాజా పరిస్థితిని నివేదించి కాలువ పూడిక తీత పనులు చేపడతామని పెద్దగెడ్డ ఎఇ సంధ్య చెప్పారు. ఆమె చెప్పి ఐదు రోజులవుతున్నా అడుగు ముందుకు పడిన దాఖలాల్లేవు. 200మీటర్ల పొడువున్న కాలువ పూడిక తీత పనులు చేపడతే కరువు ఎదుర్కొంటున్న గ్రామాల చెరువులకు నీరు చేరుతుందని రైతులు ఆశతో ఉన్నారు. కానీ ఆ ఆశలు అడియాసలయ్యే పరిస్థితి కనిపిస్తోంది. కలెక్టర్ తక్షణమే నిధులు మంజూరు చేసి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకొనేలా ఇరిగేషన్ అధికారులను అప్రమత్తం చేయాలని రైతులు కోరుతున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

## ఎన్నికల కార్యాచరణ సిద్ధం చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

సాధారణ ఎన్నికలు - 2024 నిర్వహణకు ముందస్తు కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఎంకె మీనా అన్నారు. సాధారణ ఎన్నికలు - 2024 పై జిల్లా కలెక్టర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రధానాధికారి మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని పక్కాగా ప్రణాళికలు తయారు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు - 2024 నిర్వహణకు ముందస్తు కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేశామన్నారు. జిల్లాలో నాలుగు శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయన్నారు. 1031 పోలింగ్ కేంద్రాలు, 154 రూట్లు, 154 మంది సెక్టోరల్ అధికారులు, 154 మంది సెక్టోరల్ పోలీసు అధికారులు, 440 మంది మైక్రో అబ్జర్వర్లు, 1237 మంది ప్రిసైడింగ్ అధికారులు, 4948 మంది పోలింగ్ అధికారులు, 20 మంది నోడల్ అధికారులు అవసరమని గుర్తించామని, ఆ మేరకు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారని వివరించారు. 1750 మంది భద్రతా సిబ్బంది అవసరమని అంచనా వేశామని ఆయన చెప్పారు. 381 వాహనాలు ఉండాలని ప్రాథమికంగా అంచనా వేస్తున్నామని, ఆ మేరకు వాహనాలు జిల్లాలో లభ్యం కాగలవని అన్నారు. సిబ్బంది శిక్షణ, ఎన్నికల సామగ్రి పంపిణీ, సామగ్రి స్వీకరణ, స్ట్రాంగ్ రూం, లెక్కింపు కేంద్రాలను ఒకే ప్రదేశంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో మద్యం, డ్రగ్స్ పంపిణీ జరగకుండా పటిష్టంగా ఎన్ఫోర్స్మెంట్ చర్యలు చేపట్టామనిపేర్కొన్నారు. అంతర్ రాష్ట్ర సరిహద్దు 120 కిలో మీటర్ల మేర ఉందని, జిల్లాలో నాలుగు ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో 190 మొబైల్ టవర్లు మంజూరయ్యాయని, నిర్మాణాలు ప్రారంభమైన ఇప్పటికే దాదాపు 35 టవర్లు పని చేస్తున్నాయని తెలిపారు. సమావేశంలో ఎస్‌పి విక్రాంత్ పాటిల్, డిఆర్‌ఒ జె.వెంకటరావు, ఎఎస్‌పి డాక్టర్ ఒ.దిలీప్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బంద్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

## 8న విద్యాసంస్థల బంద్

ప్రజాశక్తి - బెలగాం

విశాఖ ఉక్కు పరిరక్షణకు, కడప ఉక్కు కర్మాగారం నిర్మించాలని కోరుతూ కేజీ టు పీజీ వరకు ఈనెల 8న రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి, యువజన సంఘాలు చేపట్టే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్ఐ, ఎఐఎస్‌ఎఫ్, పిడిఎస్‌ఒ, ఎఐవైఎఫ్, డివైఎఫ్‌ఐ సంఘాల నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో బంద్‌కు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి పి.రాజశేఖర్, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్ బాబు, జిల్లా కన్వీనర్ ఎన్.నాగభూషణ్, పిడిఎస్‌ఒ జిల్లా కన్వీనర్ సోమేశ్, ఎఐవైఎఫ్ నాయకులు కోట అప్పన్న, డివైఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ ఎం.వెంకటరమణ మాట్లాడారు. విశాఖ ఉక్కు పోరాటానికి ఈనెల 8తో వెయ్యి రోజులు పూర్తవుతున్న సందర్భంగా విద్యార్థి, యువజన సంఘాలు ఈ బంద్‌ను చేపడుతున్నాయన్నారు. 32మంది కార్మికులు, యువకుల ప్రాణత్యాగం ప్రతిఫలం దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన పరిశ్రమ విశాఖ ఉక్కు పరిశ్రమ అని అన్నారు. ఇటువంటి పరిశ్రమకు తప్పుడు లెక్కలతో నష్టాన్ని చూపించి ప్రైవేట్ పరం చేయడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్న బిజెపి విధానం రాష్ట్ర ప్రజలను, దేశానికి ద్రోహం చేయడమేనని విమర్శించారు. 23 వేల ఎకరాల విస్తీర్ణంలో కేవలం రూ.4800 కోట్ల పెట్టుబడితో ప్రారంభమైన పరిశ్రమ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు దాదాపు రూ.54 వేల కోట్లు తిరిగి చెల్లించి 32 లక్షల టన్నుల నుంచి 74 లక్షల టన్నుల సామర్థ్యాన్ని పెంచుకుందన్నారు. నేడు రూ.3 లక్షల కోట్లు విలువ చేసే ఆస్తులతో లక్షల మందికి ఉపాధిని కల్పిస్తూ విశాఖ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన స్టీల్ ప్లాంట్‌ను కారుచౌకగా తమ అనుయాయులైన అదానీ, అంబానీలకు కట్టబెట్టడానికి బిజెపి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థి, యువజన సంఘాల నాయకులు కె.రాజు, సిహెచ్ సింహాచలం, ముకేశ్, నాగేంద్ర, పి.రవికుమార్ ఎ.సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతే విద్యార్థులకు ప్రధాన ఘట్టం

ప్రజాశక్తి - కురుపాం

పదో తరగతే విద్యార్థులకు ప్రధాన ఘట్టమని, కావున విద్యార్థులు కష్టపడి చదివి మెరుగైన ఫలితాలు సాధించాలని ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్ అన్నారు. మండల కేంద్రంలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వంటగది, స్టాక్ రూములను సందర్శించి విద్యార్థులకు వండిన పదార్థాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ వారి సామర్థ్యాన్ని పరిశీలించి సబ్జెక్టుల్లో ఏమైనా సందేశాలుంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. ఇప్పటి నుంచే కష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించి త్వరితగతిగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఐటిడిఎ ద్వారా నిర్మాణం జరుగుతున్న పెట్రోల్ బంకు పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రామగోవిం దం, వసతి గృహ సంరక్షణ అధికారి కె. సూర్యనారాయణ, ఉపాధ్యాయులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

**టెన్త్‌లో మెరుగైన ఫలితాలు సాధించాలి : ఆర్‌డిఒ**

**కొమరాడ :** పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలని ఆర్‌డిఒ కె.హేమలత అన్నారు. శుక్రవారం స్థానిక కెజిబివి పాఠశాలను సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి వారు చదువుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి పరీక్షలు కీలకమని, ఇప్పటి నుంచే బాగా చదవాలని హితవు పలికారు. సబ్జెక్టుల్లో సంశయాలుంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఇంగ్లీష్, గణితం మీద దృష్టి సారించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో ముఖాముఖి మాట్లాడారు. విద్యార్థులకు తక్కువ మార్కులు వచ్చే సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని విద్యా బోధనలు అందించి ప్రత్యేక తరగతులు నిర్వహించి వారికి ఉత్తమమైన మార్కులు వచ్చేలా ఉపాధ్యాయులకు కృషి చేయాలన్నారు. అనంతరం ఆరు, 9వ తరగతి నిర్వహిస్తున్న మోడల్ పరీక్షలను ఆర్డివో పరిశీలిం చారు. పలువురు విద్యార్థులకు హిందీ సబ్జెక్టుపై చదివించేం దుకు ప్రయత్నం చేసినప్పటికీ కొంత విద్యార్థులు తడబడడంతో అవగాహన కల్పించారు. ఇకపై వారంలో ఒకటి లేదా రెండుసార్లు పాఠశాలను సందర్శిస్తానని తెలిపారు.

**నూతన భవనం ప్రారంభానికి చర్యలు తీసుకోండి**

మండల కేంద్రంలో కొత్తగా నిర్మిస్తున్న రెవెన్యూ కార్యాలయ భవనం ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒ హేమలత అధికారులకు సూచించారు. నూతనంగా నిర్మాణం చేపట్టి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న భవనాన్ని ఆమె పరిశీలించారు. పాత కార్యాలయంలో ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులను ఆర్‌డిఒ దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం భవనాన్ని పరిశీలించి తక్షణమే ప్రారంభానికి సిద్ధం చేయాలని, అవసరమైన నివేదికలను సిద్ధం చేయలన్నారు. ఆర్‌డిఒ వెంట తహశీల్దార్ మల్లికార్జునరావు, ఎంఇఒ జామి నారాయణస్వామి, ఆర్ఐ శ్రీనివాసరావు, కెజిబివి స్పెషల్ ఆఫీసర్ అరుణ, తదితరులు ఉన్నారు.

## గర్భస్థ పిండ లింగ నిర్ధారణపై కఠిన చర్యలు

**పార్వతీపురం:** గర్భస్థ పిండ లింగ నిర్ధారణపై కఠిన చర్యలు చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు నేరమన్నారు. ఈ చట్టం కింద గర్భం ధరించడానికి ముందుగానీ, తర్వాత గానీ లింగ ఎంపికను నేరంగా పరిగణించడం జరుగుతుందన్నారు. ఏ లేబొరేటరీగానీ, స్కానింగ్ కేంద్రంగానీ గర్భస్థ పిండం లింగాన్ని తెలిపే ఉద్దేశ్యంతో చేయరాదని స్పష్టం చేశారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. లింగ నిర్ధారణ పరీక్షల ద్వారా ఆడశిశువు అని తెలిసి గర్భస్రావాలు చేయించడం వంటి సమాచారం తెలిస్తే 102, 104 టోల్ ఫ్రీ నంబరుకు లేదా ఆన్లైన్ గ్రీవియన్స్ (pcpndt.ap.gov.in) ద్వారా తెలియజేయవచ్చని చెప్పారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు మాట్లాడుతూ జిల్లాలో 35 స్కానింగ్ కేంద్రాలను మూడు నెలలకొకసారి తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. భామిని, వీరఘట్టం, పాలకొండ మండలాల్లో లింగ నిష్పత్తిలో తగ్గుదల ఉందన్నారు. సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్, ఎఎస్‌పి డాక్టర్ దిలీప్ కిరణ్, డిహెచ్ఎస్ఒ డాక్టర్ బి.వాగ్దేవి, ఆర్‌బిఎస్‌కె ప్రాజెక్టు అధికారి డాక్టర్ ధవళ భాస్కరరావు, ప్రోగ్రాం అధికారులు ఎం.వినోద్, టి.జగన్‌మోహన్‌రావు, సభ్యులు జికె దుర్గ, సిహెచ్ కమలకుమారి, సంధ్య, డి.పారినాయుడు, వై.వివేక్, లోచర్ల రమేష్ పాల్గొన్నారు.

**అక్రమ మద్యం విక్రయాలపై నిఘా పెట్టాలి**

అక్రమ మద్యం విక్రయాలపై నిఘా పెట్టాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎక్సైజ్, ప్రోహిబిషన్ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్రమ మద్యం విక్రయాలపై నిఘా అధికం చేయాలన్నారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలు, ఇతర మార్గాల ద్వారా జిల్లాలో నాటు సారా, మద్యం ప్రవేశించే అవకాశం ఉందని, ఆ ప్రాంతాల పట్ల పర్యవేక్షణ పక్కాగా ఉండాలని అన్నారు. బెల్టు షాపులు, ఇతర విక్రయాలపై తనిఖీలు జరగాలన్నారు. సమావేశంలో జెసి ఆర్.గోవిందరావు, ఎఎస్‌పి దిలీప్ కిరణ్, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.



నల్లరాయిగూడ పొలాల్లో సంచరిస్తున్న ఏనుగులు

## ఏజెన్సీలో ఏనుగులు తిష్ట

ప్రజాశక్తి - భామిని

మండలంలోని నల్లరాయిగూడ పంచాయతీ పరిధిలో గల జనుకగూడ, నర్సాయిగూడ ప్రాంతాల వద్ద 4 ఏనుగుల గుంపు గత ఆదివారం నుండి తిష్ట వేశాయి. ఈ ప్రాంతంలో గిరిజనుల వరిపొలాలు, అరటి, జీడీ తోటలు ఉన్నాయి. ఏపుగా పెరిగిన వరిని నాశనం చేస్తున్నాయని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మచ్చిన్న చెరువు, గంగన్న చెరువుల్లో నీటిని తాగి వచ్చి, పంట పొలాలపై తిరుగుతూ ఉండడంతో వరి చేలు నాశనమవుతున్నాయని గిరిజనులు వాపోతున్నారు. ఈ నాలుగు ఏనుగులు గ్రామ పరిసరాల్లోకి నలుగురు కేర్ టేకర్లు పరిశీలిస్తున్నట్లు ఫారెస్ట్ బీట్ అధికారి లక్ష్మణమూర్తి తెలిపారు.

## రీసర్వే వేగవంతం చేయాలి : జెసి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలో నిర్వహిస్తున్న జగనన్న భూ రీ సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని యు.వెంకంపేటలో నిర్వహిస్తున్న రీసర్వే కార్యక్రమాన్ని పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. రైతుల నుండి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా పారదర్శకంగా సర్వే చేపట్టాలని గ్రామీణ సర్వేయర్లను ఆదేశించారు. రైతులందరికీ మేలు చేకూరేలా సర్వే చేయాలన్నారు. మండలంలో సర్వే పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానిక తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లక్ష్మునాయుడు, విఆర్ఒ, మాజీ ఎంపిటిసి సభ్యులు సింహాచలం, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

## శత శాతం పన్నులు వసూలు చేయాలి

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీలో పన్నుల వసూళ్లపై సిబ్బంది దృష్టి సారించాలని మున్సిపల్ ఆర్‌డి జి.నాగరాజు ఆదేశించారు. శుక్రవారం ఆయన మున్సిపల్ డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. తడి, పొడి చెత్తలను వేరు చేయడం, కంపోస్టు ఎరువు తయారు చేయడం వంటి పనులు పరిశీలించారు. అనంతరం వార్డు సచివాలయం అడ్మిన్, ప్లానింగ్ సెక్రటరీలతో కమిషనర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. పట్టణంలో ఇళ్లకు సంబంధించిన కుళాయి పన్ను, ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్నుల వసూలు వేగవంతం చేయాలన్నారు. పట్టణ ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ టి.జయరాం పాల్గొన్నారు.

## పాత ఇనుప సామాగ్రి వేలం పాట ఖరారు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలోని ఐదు మున్సిపల్ రిజర్వాయర్ల వద్ద గల పాత ఇనుప సామాగ్రి, జిఐ పైప్‌లు, ప్లాస్టిక్ పైప్‌లు, బోర్ మెటీరియల్, ఎలక్ట్రికల్ మెటీరియల్‌తో పాటు మున్సిపల్ లైబ్రరీలో గల పాత న్యూస్ పేపర్లకు సంబంధించిన వేలం పాటను శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు, డిఇ కిరణ్‌కుమార్, రెవెన్యూ అధికారి రూబెన్, ఆర్ఐ నారాయణరావుతో కలిసి బహిరంగ వేలం పాటను నిర్వహించారు. ఈ వేలం పాటలో గుణుపూరు వెంకటరావుకు పాట ఖరారైంది. పాతపేపర్లను రణభేరి రేష్మకు వేలం పాటను ఖరారు చేశారు.

## మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఎంపిడిఒ జి.పైడితల్లి అన్నారు. మండలంలోని రావివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం అమలును శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన వంటలను పరిశీలించి రుచిచూశారు. అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం మెనూ అమలు చేయాల్సిందేనని పేర్కొన్నారు. విద్యార్థులకు రోజువారి ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం భోజనం వండిపెట్టాలని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు సూచించారు. పరిశీలనలో ఎంఇఒ నగిరెడ్డి నాగభూషణరావు, ప్రధానోపాధ్యాయులు వంగిపురం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో ఉన్న గొయ్యిను దాటేందుకు ప్రయత్నిస్తున్న ప్రయాణికులు

## రోడ్డు మధ్య నుయ్యిలా గొయ్యి...

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని సాలూరు-మక్కువ రహదారిలో పాయకపాడు సమీపంలోని బావిని తలపించేలా పెద్ద గొయ్యి రోడ్డు మధ్యలో ఏర్పడింది. కొత్త రహదారి నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోవడంతో వాహన చోదకులు నరకయాతన అనుభవిస్తున్నారు. కాలినడకన వెళ్లేవారు కూడా మోకాలు పైవరకు దుస్తులు పైకెత్తి నడవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతంలో ఏమాత్రం ఏమరపాటు వహించినా పెనుప్రమాదం సంభవించే ఆస్కారం ఉందని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా రహదారి నిర్మాణంలో పాయికపాడు సమీపంలోనే అధికంగా కల్వర్టులు వేసినప్పటికీ ఈ ప్రాంతంలోనే పెద్ద ఎత్తున గోతులు ఏర్పడడం కూడా ఇంజనీర్ల డొల్లతనాన్ని రుజువు చేస్తుందని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోతులను పూడ్చివేయాలని కోరుతున్నారు.

## బకాయిల వసూళ్లపై దృష్టిసారించాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

గ్రామాల్లో ఇంటి పన్ను బకాయిల వసూళ్లకు సంబంధించి పంచాయతీ కార్యదర్శులు తగు చర్యలు చేపట్టాలని ఇఒపిఆర్‌డి ఎల్.గోపాల రావు అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామపంచాయతీల్లో ఇంటి పన్ను బకాయిలు వసూళ్లకు సంబంధించి ఇప్పటికే ఉన్నతాధికారులు లక్ష్యాలను నిర్దేశించారన్నారు. ఎంపిడిఒ జి.పైడితల్లి మాట్లాడుతూ గ్రామపంచాయతీలు వారీగా ఇంటి పన్ను బకాయిలు వసూళ్లకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని పంచాయతీ కార్యదర్శులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పాఠశాలకు క్రీడా పరికరాలు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక వెంకంపేట ఎంపియుపి పాఠశాలకు క్రీడా పరికరాలు వచ్చినట్లు ప్రధానోపాధ్యాయుడు జి.పరాంకుశంనాయుడు తెలిపారు. పాఠశాలకు వచ్చిన పరికరాలను శుక్రవారం విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడాల్లోనూ రాణించాలన్నారు. ఆటల్లో రాణించిన వారికి ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ ఛైర్‌పర్సన్ వి.స్వాతి, వైస్ ఛైర్మన్ పేకేటి నీలకంఠ, సచివాలయం అడ్మిన్ బి.రవిత్రయణి, ఉమెన్ ప్రొటెక్షన్ ఎం.ప్రమీలా, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడాపరికరాలు అందజేసిన హెచ్‌ఎం పరాంకుశంనాయుడు

# మహిళలకు వజ్రాయుధం దిశా యాప్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఆపద సమయంలో దిశాయాప్‌ను ఉపయోగించి పోలీస్ శాఖ సహాయం పొందవచ్చునని దిశ డిఎస్‌పి ఎస్ఆర్ హర్షిత అన్నారు. ఇది మహిళలకు దిశాయాప్ వజ్రాయుధం వంటిందని అన్నారు. ఈ మేరకు స్థానిక గాయత్రి కళాశాల విద్యార్థులకు దిశాయాప్‌పై అవగాహన కల్పించారు. దిశ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు, సిబ్బంది, మహిళా పోలీసులతో కలిసి దిశ యాప్ రిజిస్ట్రేషన్ ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, వారి స్టేషను పరిధిలోని గల గ్రామాలు/వార్డు, ముఖ్య కూడళ్ళు, విద్యా సంస్థలు, జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రదేశాలు, బస్టాండులు, రైల్వే స్టేషన్లు, హాస్పిటల్స్, పార్కులు, సినిమాహాళ్ళ తదితర చోట్ల చేపట్టారు. మహిళలపై లైంగిక వేధింపులు, అఘాయిత్యాలు జరగకుండా ఉండేందుకు ప్రత్యేక దిశ యాప్‌ను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఈ యాప్‌ను ప్రతిఒక్కరి మొబైల్‌లో ఉండాలని, ఆపద సమయంలో ఉపయోగించి పోలీసు సహకారం పొందాలని, దిశా యాప్ ప్రాధాన్యతను వివరించి, ఆపద సమయంలో యాప్ వినియోగించి ఏవిధంగా రక్షణ పొందవచ్చో కూడా వివరించి, వారి మొబైల్ ఫోన్‌లో దిశ యాప్ డౌన్లోడ్, రిజిస్ట్రేషన్ చేయించారు. అలాగే ఈ యాప్ ద్వారా ఆపదలో ఉన్న ఎంతోమంది మహిళలను పోలీసులు రక్షించారని వివరించారు. కార్యక్రమంలో పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు, ఎస్‌సి, ఎస్‌టి డిఎస్‌పి జి.మురళీధర్, జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల సిఐలు, ఎస్‌ఐలు సిబ్బంది, సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

**పార్వతీపురం రూరల్ :** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం టౌన్ ఎస్ఐ దినకర్ ఆధ్వర్యంలో విద్యార్థినిలకు దిశా యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారుగా 500మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రిన్సిపల్ జ.రామారావు, మద్రాపు తాతబాబు, తెర్లి రవికుమార్, శ్రీధర్, సత్యనారాయణ, శ్రీనివాసరావు, శర్మ, రవి ప్రసాద్, శివ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు దిశాయాప్‌పై అవగాహన కల్పిస్తున్న డిఎస్‌పి హర్షిత

**పాలకొండ :** స్థానిక తమ్మినాయుడు, సత్యసాయి కళాశాలలో దిశ యాప్‌పై డిఎస్‌పి జివి కృష్ణారావు అవగాహన నిర్వహించి, విద్యార్థినులతో యాప్ రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిశా యాప్ వల్ల మహిళలపై నేరాలు తగ్గుముఖం పట్టాయని, యాప్‌పై అవగాహన పెంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సిఐ మురళీధర్, ఎస్ఐ శివప్రసాద్ తదితరులు ఉన్నారు.

**గుమ్మ లక్ష్మీపురం:** మహిళలు దిశా యాప్ పట్ల అవగాహన కలిగి ఉండాలని ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దిశాయాప్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అందరి చేత దిశా యాప్ తమ తమ మొబైల్ ఫోన్లో డౌన్లోడ్ చేయించి ఎలా వినియోగించాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ షణ్ముఖ రావు, ప్రిన్సిపాల్ శ్రీ వరం ఉన్నారు.

ఫిర్యాదులను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ గోవిందరావు

## జగనన్నకు చెబుదాంకు 159 వినతులు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మేరకు 159 వినతులు వివిధ సమస్యలపై ఆర్జీదారులు అందజేశారు. జెసితో పాటు ఆర్‌డిఒ ఎం.లావణ్య ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. వచ్చి వినతుల్లో ఎక్కువగా గ్రామ సమస్యలు, రోడ్డు, హౌసింగ్, వ్యక్తిగత సమస్యల పరిష్కారం గురించి ఉన్నాయి. అనంతరం జెసి మాట్లాడుతూ సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి అదేశాలు జారీ చేశారు. మండలంలో వరద గోడలు, తాగునీరు, కమ్యూనిటీ భవనాలు, విద్యుత్ స్తంభాలు వేయాలని ఎంపిపి ఆదినారాయణ, జెడ్‌పిటిసి ప్రతినిధి రాము, ఎఎంసి చైర్మన్ మోహన్‌రావు, సర్పంచులు వినతుల సమర్పించారు మండలంలో పెండింగ్ హౌసింగ్ బిల్లు చెల్లించాలన్నారు. 23 పంచాయితీలో కొత్త భవనాలు మంజూరు చేయాలని కోరారు ఆశ్రమ పాఠశాలల్లో కుక్, కమాటీ, వాచ్మెన్, నాలుగో తరగతి సిబ్బంది పోస్టులు నియమించాలని కోరారు. రామానగరం పెద్దగూడలో పాఠశాల భవనం మంజూరు చేయాలని ధారపాడు సర్పంచ్ జి.సుందరమ్మ విన్నవించారు. పివి ఈతమానుగూడ సర్పంచ్ పి.వీరన్న చావిడివలస పాఠశాలకు అదనపు భవనం మంజూరు చేయాలని, రహదారులు మంజూరు చేయాలని కోరారు. సిసి రోడ్లు కాలువలు మంజూరు చేయాలని పెద్దూరు సర్పంచ్ ఆదిలక్ష్మి విన్నవించారు. గ్రామకంఠం అప్పగించాలని సీతంపేట సర్పంచ్ కళావతి విన్నవించారు. వీరితో పాటు పలువురు పంచాయతీ సర్పంచులు, గ్రామస్తులు సమస్యలపై వినతులను అందజేశారు. కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు, తహశీల్దార్ నర్సింహమూర్తి, ఎంపిడిఒ గీతాంజలి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# భవిష్యత్తుకు గ్యారెంటీపై టిడిపి ప్రచారం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని రామనగరం,గొలుకుప్ప, చింతమానుగూడ, పెద్దగూడలో పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జయకృష్ణ రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపే లక్ష్యమని పార్టీ క్యాడర్ కు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి బిడ్డిక చంద్రరావు, గేదెల కాంతారావు, మండల ప్రధాన కార్యదర్శి బిడ్డిక అప్పారావు, బిడ్డిక సుబ్బారావు, క్లస్టర్ ఇంచార్జ్ ఐటీడీపి కోఆర్డినేటర్ హిమరక పవన్, ప్రచార కర్త తోయిక సంధ్యారాణి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**గరుగుబిల్లి:** మండలంలోని గొట్టివలసలో మండల టిడిపి అధ్యక్షులు అక్కేన మధుసూదనరావు ఆధ్వర్యంలో బాబు ష్యూర్టీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కురుపాం నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి తోయక జగదీశ్వరితో పాటు, పలువురు టిడిపి నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రస్తుత వైసిపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎం.పురుషోత్తమునాయుడు, ఎం.తవిటినాయుడు, ఎంబి విజయవాంకుశం అంబటి తవిటినాయుడు (రాంబాబు), స్థానిక సర్పంచ్ బోను చంద్రి నాయుడు, పెద్దింటి పూర్ణచంద్రరావు, కోట సుమన్, బొచ్చ జగదీష్, ఎం.రామారావు, దామోదరరావు, నాయకులు, కార్యకర్తలు తదితరులుపాల్గొన్నారు.

**వీరఘట్టం:** మండల కేంద్రమైన వీరఘట్టంలోని కూరాకుల, తెలగ వీధుల్లో పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఉదయాన ఉదయ భాస్కర్, మండల ప్రధాన కార్యదర్శి చింత ఉమామహేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు పారిచర్ల వెంకటరమణ, మండల తెలుగు యువత అధ్యక్షులు మాచర్ల అనిల్, బల్ల హరిబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస మండలంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

**మక్కువ :** మండలంలోని కొయ్యనుపేట పంచాయతీలో టిడిపి బాబుతో ష్యూర్టీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సాలూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టిడిపిని అధికారంలోకి తీసుకురావాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు జి.వేణుగోపాలరావు, సీనియర్ నాయకులు ఎం.ప్రసాదరావునాయుడు, పలువురు టిడిపి గ్రామస్థాయి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**గుమ్మలక్ష్మీపురం :** జియ్యమ్మవలస మండలం జోగులడుమ్మలో బాబు ష్యూర్టీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి టిడిపి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. టిడిపిని గెలిపిస్తే భవిష్యత్తు భరోసా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పల్ల రాంబాబు, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎంపిపి బొంగు సురేష్, అరుకు పార్లమెంట్ ఎస్‌టి సెల్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రమాద బీమా పరిహారం అందజేత

ప్రజాశక్తి - సీతానగరం

మృతుడి భార్యకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

మండలంలోని పెదభోగిలికి చెందిన యజ్జల బుజ్జి ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందగా వైయస్సార్ ప్రమాద బీమా ద్వారా రూ.5 లక్షలు చెక్కును ఎమ్మెల్యే అలజంగి జోగారావు బుజ్జి భార్య భారతికి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన వారికి ఈ పథకం ద్వారా ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, పార్టీ అధ్యక్షులు బొంగు చిట్టిరాజు, ఎంపిపి ప్రతినిధి బలగ శ్రీరాములనాయుడు, ఎంపిటిసిసభ్యులు సొరగాల గౌరి, కిరణ్, సర్పంచ్ జొన్నాడ తెరేజమ్మ, గరికయ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**సిసి రోడ్డు పనులు పరిశీలన**

అనంతరం గ్రామంలోని బిసివీధి, రెల్లి వీధుల్లో సిసి రోడ్ల పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకు ప్రభుత్వం ద్వారా సమస్యలు తెలుసుకుని నిధులు మంజూరు చేస్తామన్నారు. పనులను పూర్తి చేయాలన్నారు. వచ్చిన సమస్యలు పరిష్కరించే దిశగా కృషి జరుగుతుందని తెలిపారు.



వైద్యాధికారులతో ఎంపిపి వెంకటరమణ నాయుడు

## ప్రజలకు మెరుగైన వైద్యమందించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యులు తమ వంతు కృషి చేయాలని ఎంపిపి డి.వెంకటరమణనాయుడు అన్నారు. మండలంలోని నడిమికెళ్లలో శుక్రవారం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సందర్శించిన సందర్భంగా మాట్లాడారు. శిబిరానికి వచ్చిన ప్రజలకు క్షుణ్ణంగా వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేయాలన్నారు. అంతకుముందు ఐసిడిఎస్ వారు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 450 మందికి పైబడి వైద్య తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డోకల సుజాత-శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ జి.గౌరీశంకర్, పిఎసిసి డైరెక్టర్ భోగి లతా మాణిక్య చంద్రశేఖర్, వైద్యాధికారులు పి.ఉమామహేశ్వరి, ఎస్.నితీసా, ఎస్.సుకన్య, కె.సునీల్‌రెడ్డి, బి.ఉమ, పలువురు అధికారులు, సిబ్బంది, ఎఎన్‌ఎం, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## యుటిఎఫ్ స్వర్ణోత్సవాలు విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

పార్వతీపురంలో ఈనెల 5న జరగనున్న యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి మజ్జి పైడిరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంఇఒ కార్యాలయ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. డిఇఒ కార్యాలయం నుండి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించనున్నామని తెలిపారు. ర్యాలీలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. స్వర్ణోత్స వానికి ముఖ్యవక్తగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వర్లు హాజరు కానున్నారని తెలిపారు. విలేకరుల సమావేశంలో యుటిఎఫ్ మండల అధ్యక్షప్రధాన కార్యదర్శులు బి.దుర్గాప్రసాద్, కె.గోవిందరావు, ఆడిట్ కమిటీ మెంబర్ ఎస్ మహేష్ పాల్గొన్నారు.

**ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు ఆహ్వానం అందజేత**

**పార్వతీపురంరూరల్ :** యుటిఎఫ్ స్వర్ణోత్సవ ప్రారంభ వేడుకలకు రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావును నాయకులు ఆహ్వానించారు. శుక్రవారం ఆయన స్వగృహానికి యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.రమేష్, కార్యదర్శి వెళ్లి ఆహ్వానించారు.

## ఆక్రమణలు గుర్తించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

సమావేశంలో మాట్లాడుతున్న గణాంక అధికారి

మండలంలోని సాగు నీటి చెరువుల ఆక్రమణలు గుర్తించాలని డివిజన్ సహాయ గణాంకాల అధికారి కె.జయప్రకాష్ విఆర్ఒలకు సూచించారు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ప్రభుత్వం కొత్తగా రూపొందించిన యాప్‌పై విఆర్ఒలకు శిక్షణ ఇచ్చారు. మండలంలోని 74 సాగునీరు చెరువులున్నట్లు చిన్న నీటిపారుదల శాఖ పేర్కొందని, అలాగే ఊట చెరువులు స్థితిగతులు పరిశీలించి ఆక్రమణకు గురైతే ఫోటోలు తీసి యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. అలాగే చెరువుల నీటి సామర్థ్యం నమోదు చేస్తూ ఫోటోలు అప్లోడ్ చేయాలని తెలిపారు. శిక్షణలో తహశీల్దార్ రాజశేఖర్, ఎఎస్ఒ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

## రెండో విడత రైతు భరోసా నిధుల విడుదల

ప్రజాశక్తి - పాచిపెంట

ఈనెల 7న రెండో విడత రైతు భరోసా నిధులను రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేయనుందని, దీనికి సంబంధించిన జాబితాలను రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించారని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు తెలిపారు. రాయిగుడ్డివలస, నాందేడువలస గ్రామాల్లో జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతూ రైతు భరోసా అర్హులు, అనర్హుల జాబితాలు రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించారని రైతులు వెళ్లి పరిశీలించుకోవచ్చునని తెలిపారు. అలాగే అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం 2023ను పురస్కరించుకుని చిరుధాన్యాలన్నింటికీ మద్దతు ధర కల్పిస్తూ ప్రభుత్వమే చిరుధాన్యాలను కొనుగోలు చేయనుందన్నారు. కావున రైతులు దళారులకు ఇవ్వొద్దని తెలిపారు. క్వింటా రాగులకు రూ.3846 మద్దతు ధరగా ప్రకటించిందని తెలిపారు. అలాగే సాలూరు మార్కెట్ యార్డ్ ద్వారా పత్తి కొనుగోలు జరగనుందని పొడవుపింజ పత్తి క్వింటా రూ.7020, పొట్టి పింజ పత్తికి రూ.6020 మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తుందన్నారు. తేమ శాతం ఎనిమిదికి మించకుండా చూసుకోవాలని తెలిపారు. అలాగే ఈ ఏడాది ధాన్యం కొనుగోలు క్వింటా ఎ-గ్రేడ్ రకానికి రూ.2203, సాధారణ రకానికి రూ.2183 ప్రకటించిందని తెలిపారు. రైతులు ఆర్‌బికెల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని, సొంత వాహనాలతో తరలించాలంటే తప్పనిసరిగా జిపిఎస్ ముందుగానే అమర్చుకుని వాహనాన్ని కూడా రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. ఎపిఎంఐపి ద్వారా నీటి గొట్టాలు, డ్రిప్ ఇస్తున్నారని, కావాల్సిన రైతులు ఆర్‌బికెల్లో నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విఎఎలు సాయి గణేష్, అనిల్ కుమార్, సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

## పాలకవర్గానికి ప్రజా సమస్యలు పట్టవా? : సిపిఎం

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలోని ప్రజల సమస్యలు పాలకవర్గానికి పట్టావా అని, సమస్యలు పరిష్కారానికి కాకుండా ప్రతినెలా పాలకవర్గాలు సమావేశాలు ఎందుకోసమని సిపిఎం నాయకులు డి.రమణరావు, కె.రాము. డి.దుర్గారావు ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక జగన్నాథ్ టెంపుల్ వద్ద పడి ఉన్న వాటర్ పైపుల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కోసం ప్రభుత్వ నిధులు ఖర్చుపెడుతున్నారా లేకపోతే తాగునీరు సరఫరా కోసమని పైపులు తెచ్చారా అని ప్రశ్నించారు. వాటర్ ట్యాంకుల నిర్మాణం జరగలేదని, కొన్ని వార్డులకు మాత్రమే పైపులైన్లు వేశారు కానీ రోడ్లు పాడయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకొండ ప్రజలకు తాగునీటి సరఫరా ఎప్పుడు..? నెల రోజులకే తాత్కాలిక డంపింగ్ యార్డ్ అని అన్నారు. నేటికీ డంపింగ్ యార్డ్ తరలించలేదన్నారు. పూడికల తీత పేరున ప్రతి ఏటా లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నా అభివృద్ధి మాత్రం ఎక్కడా కానరావడంలేన్నారు. ప్రజలకు కనీస మౌలిక అవసరాల పరిష్కారానికి కాకుండా, ప్రతినెలా పాలకవర్గాలు, సమావేశాలు ఎవరి కోసం జరుపుతున్నారని ప్రశ్నించారు. డంపింగ్ యార్డ్‌ను ఎప్పుడు తరలిస్తారు?, ఇంటింటికి తాగునీరు సరఫరా చేసేది ఎప్పుడు? నూతన డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం చేసేది ఎప్పుడని ప్రశ్నించారు. వీటిపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేసి సమాధానం చెప్పాలని, లేకుంటే ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## ధాన్యం కొనుగోలుపై శిక్షణ

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం సాంకేతిక సహాయ అధికారి కల్యాణ్‌ఆచారి, గ్రామీణ వ్యవసాయ సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రేడు ఎ- రకం రూ.2203, సాధారణ రకం రూ.2183కు క్వింటా రైతుల నుండి కొనుగోలు చేశామన్నారు. ముందుగా రైతుల వివరాలను నమోదు చేయాలని సూచించారు. సచివాలయాల్లో నమోదైన వాహనాలకు సంబంధిత మిల్లులకు ధాన్యం రవాణా చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలుపై రైతులకు గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ సహాయకులు పి.రాజశేఖర్, జి.వనిత, ఎఒ జక్కువ సౌజన్య, వ్యవసాయ విస్తీర్ణ అధికారి బి.కృష్ణకాంత్, టిఎ, డిఇఒలు, విఎఎలు పాల్గొన్నారు.

# సామర్థ్యాలు వెలికి తీసేందుకే ఎస్‌సిఇఆర్‌టి

ప్రజాశక్తి - వీరఘట్టం

విద్యార్థుల విద్యాసామర్థ్యం వెలికి తీసేందుకే స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వేస్ ఉద్దేశమని ఎంపిడిఒ వై.వెంకటరమణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని నడిమికెళ్లలో ఎంపియుపి పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్షను పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. చదువు విషయంలో ప్రతి ఒక్కర్లో పోటీతత్వం కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. బాగా చదువుకుని ఇటు పాఠశాలకు అటు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొచ్చేలా పట్టుదలతో చదవాలన్నారు. మండలంలోని 24 పాఠశాలల నుండి 39 పరీక్ష గదుల్లో పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గణితం, భాషా సబ్జెక్టులకు సంబంధించి పరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంఇఒలు ఆర్.ఆనందరావు, డి.గౌరినాయుడు, ఇన్విజిలెటర్లు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**కురుపాం :** స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్మెంట్ సర్వే/నేషనల్ అచీవ్మెంట్ సర్వే పరీక్షకు మండలంలోని 21పాఠశాలలకు చెందిన 3,6,9 తరగతులు విద్యార్థులు 881మంది హాజరయ్యారు. మండలంలో పలు పరీక్ష కేంద్రాలను ఎంఇఒ ఎన్.సత్యనారాయణ, ఎఎంఒ బి.శ్రీనివాస్ సందర్శించి పరిశీలించారు.

**గుమ్మలక్ష్మీపురం:** మండలంలోని పలు పాఠశాలల్లో జరుగుతున్న స్టేట్ లెవెల్ అచీవ్మెంట్ సర్వే టెస్ట్‌ను ఎంఇఒలు చంద్రశేఖర్, జనార్దన్‌నాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా వీరు పలు పాఠశాలలను పరిశీలించి మోడల్ టీం సభ్యులకు, సపోర్టింగ్ టీచర్లకు, సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అచీవ్మెంటు సర్వే టెస్టును పకడ్బందీగా ప్రతి ఒక్కరూ నిర్వహించాలన్నారు. ఎక్కడైనా తప్పులు జరిగితే సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులను బాధ్యులను చేస్తామన్నారు. ఈ మేరకు పాఠశాలల ఉపాధ్యాయులు మోడల్ టీం సభ్యులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆయన వెంట నోడల్ టీం బృందం సభ్యులు సూర్యనారాయణ, బంటు సింహాచలం, ఎం.భాస్కర్ రావు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ వాసు, తదితరులు ఉన్నారు.

వీరఘట్టం : పరీక్షా పత్రాలు విడుదల చేస్తున్న ఎంఇఒలు

# జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

ప్రజాశక్తి - బెలగాం

జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు వి.సత్యనారాయణ, బి.అప్పలనాయుడు, ఇవి నాయుడు కోరారు. ఈ మేరకు వీరు పార్వతీపురం మండలం సంగంవలసలో ఎండిపోయిన వరి పంటలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలకు ఆకులు ముదురి చనిపోగా, మిగిలిన ఆకును వర్షం పడ్డది కనుక అధిక మదుపులు పెట్టి ఉభాలు చేశారన్నారు. పంటకు నీరు లేకపోవడంతో ఇంజన్ పెట్టి చెరువులో ఉన్న అదనంగా పెట్టుబడులు పెట్టి పంటను రక్షించుకుందామని రైతులు పడరాని పాట్లు పడుతుండగా ఇంతలో తెగుళ్ల సోకే మరింత కుషించుకుపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం పశువులకు మేత కూడా పనికిరాకుండా పంట పోయిందన్నారు. కావున ప్రభుత్వం స్పందించి జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

## మన స్థాపానికి గురై యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలోని కొత్తవలసలో గల మణికంఠ కాలనీకి చెందిన దుప్పలపూడి సునీల్ (21) షార్ట్ ఫిలింలో నటిస్తూ, దర్శకత్వం చేస్తున్నాడు. గురువారం రాత్రి ఆయన తల్లి సరస్వతిని రూ. 50 వేలు ఇమ్మని అడగ్గా తమ వద్ద డబ్బుల్లేవని చెప్పడంతో తల్లితో గొడవపడి అదే రోజు రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ మేరకు తల్లి సరస్వతి శుక్రవారం పట్టణ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ నారాయణ రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సరస్వతి స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గల మెప్మాలో ఆర్‌పిగా విధులు నిర్వహిస్తున్నారు.

మృతి చెందిన సునీల్